సాక్షి ఒడిశా

మంగళవారం | 12 | ఆగస్టు | 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,07,317లు, బంగారం 250 మిల్లీగ్రాము, వెండి 20గ్రాముల700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సైకత తిరంగా శిల్పం

ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో కలిసి సాగుదామని సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ కళాత్మకంగా పిలుపునిచ్చాడు. పూరీ సాగర తీరంలో ఈ అపురూప సైకత శిల్పాన్ని ఆవిష్కరించాడు.

భువనేశ్వర్/పూరీ



న్యూస్‌రీల్

పిడుగుపాటుకు నాలుగు పశువులు మృతి



మృతి చెందిన పశువులు

రాయగడ: పిడుగుపాటుకు నాలుగు పశువులు మృతి చెందాయి. ఈ ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి నకిటిగుడ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతోపాటు పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న పశువు అక్కడికక్కడే మృతి చెందాయి. సాయంత్రం పశువులకు మేత వేసి వాటిని చెట్టుకింద కడుతుండగా అదే సమయంలో పిడుగు పడింది. ఈ ఘటనలో లూకపతి మాఝి అనే వ్యక్తి గాయాలు పాలయ్యాడు. అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

చిడివలసలో ప్రేమజంటకు నాగలి శిక్ష



నాగలి శిక్ష అనుభవించిన ప్రేమజంట

జయపురం: కొరాపుట్ జిల్లా బందుగాం సమితి అలమండ పంచాయతీ పరిధిలోని సరిహద్దు గ్రామం చిమిడివలసలో ఒక జంటకు నాగలి శిక్ష విధించారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రేమికులు ఇద్దరూ ఒకే కులం వారు. అయితే ఒకటే వంశం కావడం వల్ల జాతి పెద్దలకు చెప్పకుండా వివాహం చేసుకోవడంతో ఈ శిక్ష విధించారు. గ్రామ ప్రజల సమక్షంలో పురుషుడు నాగలి లాగి మహిళను మూడు సార్లు తిప్పేలా చేయటం సంప్రదాయ శిక్ష. గ్రామ నియమాల ప్రకారం సంప్రదాయాన్ని ఉల్లంఘించినందుకు గ్రామానికి ఒక డబ్బా సారాతో పాటుఒక ఆవుని ఇవ్వాలని గ్రామ పెద్దలు శిక్ష విధించారు.

కాలువలో భారీ మొసలి



కాలువలో మొసలి సంచారం

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా జరిముల్ బజార్ కాలువలో భారీ మొసలి కనిపించింది. ఇది సమారు 20 అడుగుల పొడవు ఉంటుందని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ కాలువలో ఈ మొసలి చాలాసార్లు కనిపించిందని గ్రామస్తుల సమాచారం. అటవీ శాఖ అధికారులకు పలుమార్లు అభ్యర్థించినా స్పందించడం లేదని గ్రామస్తుల ఆరోపణ. ఇంత వరకు అటవీ శాఖ మొసలిని పట్టుకుని వేరే ప్రదేశానికి తరలించలేదని స్థానికులు కలవర పడుతున్నారు. స్థానిక రైతులు తమ పొలాల్లో సాగు పనులు చేయడానికి వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీ శాఖకు సమాచారం ఇచ్చినప్పటికీ, మొసలిని పట్టుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భిత్తర్‌కనికా నుంచి వచ్చే వరద నీటి ద్వారా మొసలి కాలువలోకి ప్రవేశించిందని భావిస్తున్నారు. మొసలిని అదుపులోకి తీసుకుని దాని సహజ నివాస స్థలం భిత్తర్‌కనికా అభయారణ్యంలో తిరిగి వదలడానికి అటవీ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్ బబితా పాత్రో బాధ్యతల స్వీకరణ



బబితా పాత్రో

భువనేశ్వర్ : రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా బబితా పాత్రో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పిల్లలే దేశ భవిష్యత్, వారి భద్రత ముఖ్యం. గత కేసులను అధ్యయనం చేసి భావి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

వాతావరణ మార్పులను గమనించాలి



పర్యావరణ పరిరక్షణ సూచనగా పచ్చని మొక్కకు నీరు పోసి సదస్సు ప్రారంభించిన గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి



ఒడిశా యువజన సదస్సులో గవర్నర్ ప్రసంగం

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: వాతావరణ మార్పులకు దీటుగా ఉండే భవిష్యత్ నిర్మాణంలో యువత త్రిముఖ పాత్రధారులు కావాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. అవగాహనను వ్యాప్తి చేసే విద్యావేత్తలుగా, హరిత సాంకేతికతలను అభివృద్ధి చేసే ఆవిష్కర్తలుగా, సుస్థిర జీవన శైలి మార్గదర్శకులుగా ఎదగాలని అభినందించారు. యూనిసెఫ్, 50 పైబడి పర్యావరణ పరిరక్షణ సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించిన ఒడిశా యువజన సదస్సు–2025 (సీఓవై) ప్రారంభ సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. ఏ దేశానికైనా అత్యంత విలువైన వనరు యువత అని, భావి పరిణామాలకు అనుకూలమైన ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో యువత ఊహ, ఆదర్శాలు బలమైన సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వర్ధమాన ప్రపంచం వాతావరణ మార్పుల తీవ్రమైన సవాలును ఎదుర్కొంటోందని తెలిపారు. యువత దృఢ సంకల్పం, శక్తివంతమైన సృజనాత్మకతతో వాతావరణ మార్పులకు దీటుగా ఉండే భవిష్యత్‌కు వెలుగు రేఖ కావాలని ప్రోత్సహించారు. 'ప్రకృతి రక్షతి రక్షితః ప్రాచీన నినాదం. ప్రకృతి తనను రక్షించే వారిని రక్షిస్తుంది అనే పురాతన జ్ఞానం మానవత్వం, ప్రకృతి మధ్య సమతుల్యతను లోతుగా వివరిస్తుంది. ఈ నినాదం పట్ల వర్ధమాన తరాలు నిబద్ధతతో కూడిన చర్యలతో చురుకుగా కృషి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజానీకంలో అవగాహనను సమర్థవంతంగా వ్యాప్తి చేయడానికి సోషల్ మీడియా, కమ్యూనిటీ నెట్‌వర్క్‌లు మరియు అట్టడుగు స్థాయి చొరవల శక్తిని యువత సద్వినియోగం చేసుకోవాలి' అని గవర్నర్ కోరారు. వాతావరణ పరిరక్షణ రంగంలో యువతకు సాధికారత కల్పిస్తున్న యూనిసెఫ్, యూత్ ఫర్ వాటర్ ప్లస్ ప్రచారం ప్రసంశనీయమని అన్నారు. ఈ రంగంలో దీటైన భవిష్యత్ నాయకుల ఆవిష్కరణలో ఈ చర్యలు దోహదపడతాయన్నారు. రాష్ట్ర డైరెక్టర్ పర్యావరణ శాఖ డైరెక్టర్, ప్రత్యేక కార్యదర్శి, కె. ఎస్. ప్రదీప్, ఏఎస్‌బీఎం విశ్వ విద్యాలయం అధ్యక్షుడు బిశ్వజిత్ పట్నాయక్, యూనిసెఫ్ ఒడిశా చీఫ్, యూత్ ఫర్ వాటర్ ప్లస్ సలహా సభ్యుడు, విలియం హాన్లాన్ జూనియర్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న యువత

88 శాతం ఫిర్యాదులు పరిష్కారం



ముఖ్యమంత్రి ఫిర్యాదుల శిబిరంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టరు ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: స్థానిక యూనిట్–2లో సోమవారం జరిగిన 14వ విడత ముఖ్యమంత్రి ఫిర్యాదుల పరిష్కార శిబిరంలో 88 శాతం ఫిర్యాదులు పరిష్కృతం అయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో 8 మంది క్యాబినెట్ మంత్రులు, 3 మంది అదనపు ప్రధాన కార్యదర్శులు,కీలక విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు సమగ్రంగా దాఖలైన 12,252 అర్జీల్లో 10,807 పరిష్కృతం అయ్యాయి. మిగిలిన ఫిర్యాదులు పరిశీలన దశలో ఉన్నాయి. సోమవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన బాధిత వర్గంతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాటామంతీ చేసి ప్రత్యక్షంగా బాగోగుల్ని పర్యవేక్షించారు. ప్రధానంగా దివ్యాంగులు, తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న వారితో ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా మాట్లాడారు. వారి పిటిషన్లను స్వయంగా స్వీకరించి తక్షణ చర్యలకు ఆదేశించారు. బాధిత వర్గానికి ఓదార్పు ఊరట కలిగించారు. ఈ శిబిరంలో పాల్గొన్న కేబినెట్ మంత్రుల్లో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, డాక్టర్ ముఖేష్ మహాలింగ్, డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో, రవి నారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, సూర్య వంశీ సూరజ్, ప్రదీప్ బాల్ సమంత్, గణేష్ రామ్ సింగ్ ఖుంటియా ఉన్నారు. అదనపు ప్రధాన కార్యదర్శులు సత్యబ్రత సాహు (హోం), సురేంద్ర కుమార్ (సాధారణ పాలన, ప్రజాభియోగాలు), దేవరంజన్ కుమార్ సింగ్ (రెవెన్యూ, విపత్తు నిర్వహణ) ముఖ్యమంత్రి ఫిర్యాదుల శిబిరంలో పాలుపంచుకున్నారు. ఈ శిబిరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిరవధికంగా నిర్వహిస్తున్నారు. దీంతో దీర్ఘ కాలిక ఫిర్యాదులకు విముక్తి కలగుతుంది. మరో వైపు ప్రజలు, పాలకుల మధ్య అంతరం తగ్గుముఖం పడుతుంది.



ముఖ్యమంత్రి ఫిర్యాదుల శిబిరంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్



బాధితుల గోడు ప్రత్యక్షంగా ఆలకిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

రాయిఘర్ బంద్ ప్రశాంతం



ఆందోళనలో కాదంబనీ త్రిపాఠీ తదితరులు



విద్యార్థిని మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రమేష్‌చంద్ర మజ్జి

కొరాపుట్: నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యను నిరసిస్తూ సోమవారం చేపట్టిన రాయిఘర్ బంద్ ప్రశాంతంగా, పరిపూర్ణంగా ముగిసింది. నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితిలో ప్రతిపక్షాలు 12 గంటల బంద్ నిర్వహించారు. ఈ ప్రాంతంకి చెందిన నర్సింగ్ విద్యార్థిని (20) అశ్లీల చిత్రాలు ఇద్దరు యువకులు వైరల్ చేయడంతో ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను భువనేశ్వర్ ఎయిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనను నిరసిస్తూ బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మహిళా హక్కుల ఉద్యమ నాయకురాలు కాదంబని త్రిపాఠీ, మాజీ ఎంపీలు రమేష్ చంద్ర మజ్జి, ప్రదీప్ మజ్జి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్నా త్రిపాఠీ, భుజబల్ మజ్జిలుబంద్‌లో పాల్గొన్నారు. యువతి మృతదేహానికి నివాళులర్పించారు.

8 అడుగుల కొండ చిలువ పట్టివేత



రాకేష్ పట్టిన కొండ చిలువ



తెల్లనాగు పాము

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఆర్ఎంసీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రదీప్ మాళి అనే వ్యక్తి ఇంటి ఆవరణలో ఆదివారం రాత్రి ఓ కొండ చిలువ దర్శనమిచ్చింది. వెంటనే కలిమెల స్నేక్‌హెల్ప్‌లైన్ రాకేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన రాత్రి 11 గంటల సమయంలో వచ్చి పామును పట్టుకున్నారు. అనంతరం అడవిలో విడిచిపెట్టారు. అలాగే సోమవారం కలిమెల సమితి మహరాజ్‌పల్లి పంచాయతీ ఎంవీ 81 గ్రామంలో ఓ ఇంటిలో చొరబడిన నాగుపామును పట్టుకున్నారు.

ఆన్‌లైన్‌లో మహా ప్రసాదం విక్రయం అపవిత్ర చర్య

- న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథుని మహాప్రసాదం ఆన్‌లైన్‌లో విక్రయించడం అపవిత్ర చర్యగా రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. వివిధ సంస్థలు స్వామి మహా ప్రసాదం ఆన్‌లైన్‌లో బట్వాడాకు ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) నిర్ద్వంద్వంగా తిరస్కరించాయని సోమవారం మీడియాతో జరిగిన సంభాషణలో మంత్రి ఈ నిర్ణయాన్ని ధృవీకరించారు. శ్రీ జగన్నాథుని మహా ప్రసాదం పవిత్రత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఆలయ శతాబ్దాల నాటి సంప్రదాయాలతో ముడి పడి ఉందని, శ్రీ జగన్నాథుని సంస్కృతి ప్రత్యేకమైనదని తెలిపారు. పూరీ శ్రీ మందిరంలో శ్రీ జగన్నాథుని దర్శనం తర్వాత ప్రధాన దేవస్థానం సముదాయం ఆనంద బజారు వాకిట స్వామికి నివేదించిన పవిత్ర ఒభొడా (అన్న ప్రసాదాలు) కొనుగోలు చేసి అక్కడికక్కడే స్వీకరించడం శ్రీ మందిరం సంస్కృతిలో ఇమిడిపోయిన అనాది కాలపు ఆచరణగా మంత్రి తెలిపారు. స్వామి మహా ప్రసాద పంపిణీని వాణిజ్య ఆహార పంపిణీ రీతిలో పరిగణించవద్దని హితవు పలికారు. అలాంటి చర్యలు ప్రసాదాల మతపరమైన సారాన్ని నీరుగార్చుతాయి. ఇటువంటి చర్యల్ని ప్రోత్సహిస్తున్న దేశ వ్యాప్తంగా ఇతర దేవస్థానాలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పునరాలోచించాల్సి ఉందని ఎస్‌జేటీఏ ఇతర ఆలయ సంస్థలను కోరింది. మహాప్రసాదం ఆన్‌లైన్‌లో పంపిణీ చేయబోమని స్పష్టం చేశారు.

నియమిత ధరలకు ప్రసాదాలు

శ్రీ మందిరం సముదాయం ఆనంద బజారు ప్రాంగణంలో స్వామికి నివేదించిన పలు రకాల ప్రసాదాల్ని సరసమైన ధరలకు నాణ్యమైన పదార్థాలు విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఒభొడా తదితర ప్రసాదాల ధరలు ఖరారు చేసి పూర్తి వివరాలతో ధరల పట్టిక ఆనంద బజారు ప్రాంగణంలో ప్రదర్శిస్తామన్నారు. మహా ప్రసాదాన్ని వ్యాపారపరం చేయకుండా పవిత్రత పరిరక్షణలో శ్రీ మందిరం దేవస్థానం అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. ఆనంద బజారు వాకిట్లో మహా ప్రసాదం సేవన చతుర్ధామ క్షేత్రం పూరీ యాత్రలో భాగంగా ఇమిడిపోయిన పురాతన సంప్రదాయం. దీని పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఆవరణలో బైఠాయించిన రెవెన్యూ ఉద్యోగులు



గజపతి కలెక్టరేట్ ఆవరణలో సమ్మె చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- ఒడిశా రెవెన్యూ ఉద్యోగుల సంఘం

పర్లాకిమిడి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఒడిషా రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. తొమ్మిది డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగులకు మూలవేతనం లెవల్ తొమ్మిదికి పెంచాలని, కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాతదే అమలు చేయలని, క్యాడర్ రీస్ట్రక్చర్ చేయడమే కాకుండా కొత్తత్త పోస్టులు మంజూరు చేయాలని, ఉద్యోగుల కుటుంబాలకు అర్హులైన వారికి ఉద్యోగం ఇచ్చేందుకు 2020 వీఆర్ఎస్ నిబంధన రద్దు చేయాలని, ఉద్యోగులకు రూ. 20 లక్షల ఆరోగ్యబీమా, ప్రతి నాలుగేళ్లకు క్యాడర్ ప్రమోషన్‌లో జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్‌గా పదోన్నతి కల్పించాలన్న పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచామని గజపతి జిల్లా రెవెన్యూ అమలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి సంతును మిశ్రా విలేకరులతో అన్నారు. ఆందోళనలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రసాద్ కుమార్ సాహు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కోసమే మా పోరాటం



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జయంత దాస్



పార్టీ 18 వ సెమినార్ సందర్భంగా పార్టీ శ్రేణుల ర్యాలీ

జయపురం:

భారతీయ కమ్యూనిస్టు పార్టీ గత వందేళ్లగా ప్రజల హక్కుల కోసం, సామ్రాజ్య వాదులకు, పెట్టుబడు దారులకు, దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయంత దాస్ అన్నారు. సోమవారం జయపురం సహిద్ మండపం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ 18వ జిల్లా స్థాయి రెండు దినాల సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలకులు దేశంలో మత విభేదాలు సృష్టిస్తున్నారని, కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని తెలిపారు. మత శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా జిల్లా పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు అరుణ పతాకాలతో ర్యాలీ చేశారు. సభలో కమ్యూనిస్టు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి, ఆల్‌ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సాధారణ కార్యదర్శి బిజయ జెన తదితరులు కేంద్ర విధానాలను వ్యతిరేకించారు. జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో సెప్టెంబర్ 4 నుంచి 6 వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ

క్లుప్తంగా

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

● పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. ఎకరాకు 25 కిలోల యూరియా అందించాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడం ఏంటని ప్రశ్నించారు. గొట్టా బ్యారేజీలో నీటి స్థిరీకరణలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులకు ఇబ్బంది లేకుండా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులను కూటమి ప్రభుత్వ దారుణంగా వంచించిందని విమర్శించారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఎరువులు అందించకపోతే, వైఎస్సార్‌సీపీ తరుపున ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. అలాగే వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మెరుగైన వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో మాట్లాడారు. ఆయనతో పాటు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, నాయకులు బి.శేషగిరి, కె.లవకుమార్, ఎం.రాము తదితరులు ఉన్నారు.

'27లోగా దరఖాస్తు చేయండి'

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ధర్మకర్తల పాలక మండలి నియామకాలకు దేవదాయ శాఖ నోటిఫికేషన్‌ను ఈనెల 7న విడుదల చేసిందని, ఈ మేరకు ఆసక్తి గలవారు ఈనెల 27లోగా తమ దరఖాస్తులను ఆలయానికి సమర్పించాలని ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలియజేశారు. ధర్మకర్తలకు కచ్చితమైన అర్హత లుంటాయని, వీటి ప్రొఫార్మా-2 ప్రకారం దరఖాస్తులను అన్ని ధ్రువపత్రాలతో సహా కార్యాలయానికి స్వయంగా గానీ పోస్టల్ రూపంలో గానీ అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ కార్యాలయ అడ్రస్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491000708, 8978914660 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

తాడేపల్లిలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం ధర్నా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 13న తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.జయరాం, ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు, గౌరవాధ్యక్షుడు కె.గుండారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండేళ్లుగా మూడు విడతల ఆర్‌టీఎఫ్, 2024-25 విద్యాసంవత్సరానికి గాను మూడు విడతల ఆర్‌టీఎఫ్ కలిపి మొత్తంగా ఆరు విడతల ఆర్‌టీఎఫ్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం విచారకరమన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పక్షంలో బుధవారం ధర్నా చేయనున్నామని తెలిపారు.

మహిళ మెడలో చైన్ చోరీ

రణస్థలం: మండలంలోని అర్జునవలస పంచాయతీ పరిధి గిడిజాలపేట పరిధిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి చైన్ లాక్కొని పరారైనట్లు జేఆర్ పురం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి చెందిన అలిగిరి శ్రీజ విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల మహారాజ కళాశాలలో హోమియోపతి నర్సింగ్ చదువుతోంది. శ్రీకాకుళంలోని ఇంటి నుంచి స్కూటీపై బయల్దేరిన శ్రీజ రణస్థలం మండలంలోని అర్జునవలస పంచాయతీ పరిధి గిడిజాలపేట రహదారిపై వెళ్తుండగా, సాయంత్రం 5 గంటల సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మెడలోని తులం బంగారం చైన్ లాక్కొని నెల్లిమర్ల వైపు పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలియజేశారు.

ప్రతి ఇంటికీ జాతీయ జెండా పంపిణీ



జిల్లా పంచాయతీరాజ్ రిసోర్సు కేంద్రం వద్ద స్వయం సహాయక గ్రూపులు



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో..

పర్లాకిమిడి: భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ ప్రతి ఇంటిమీద త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో మిషన్ శక్తి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఉచితంగా త్రివర్ణ పతాకం అందజేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మిషన్ శక్తి అధికారి టిమోన్ బోరా, జిల్లా సాంస్కృతిక శాఖ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సునారాం సింగ్, ఉద్యానవనాలు శాఖ ఉపసంచాలకులు సుశాంత రంజన్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ పతాక వితరణ కార్యక్రమంలో పాల్గొని లక్ష త్రివర్ణ పతాకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏడు మండలాల్లో పనిచేస్తున్న స్వయం సహాయక గ్రూపులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కార్యాలయం ధ్వంసం



కిటికీలు ధ్వంసమైన దృశ్యం

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ 45వ నంబర్ కార్పొరేటర్ అమరేష్ జెనా కార్యాలయం ధ్వంసమైంది. అర్ధ రాత్రి పూట వార్డు కార్యాలయంలోకి నలుగురు, ఐదుగురు గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. దుర్భాషలాడి కిటికీపై రాళ్లు రువ్వి విధ్వంసానికి పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు స్థానిక ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణ చేపడుతున్నారు.

పాత్రికేయుల ఔదార్యం



గుండెపోటుకు గురైన రోగిని ఆస్పత్రికి తరలిస్తున్న పాత్రికేయులు

రాయగడ: ఒక నిండు ప్రాణాన్ని సకాలంలో పాత్రికేయులు కాపాడారు. సోమవారం వేకువజామున విశాఖపట్నం నుంచి భవానిపట్నం వైపు వెళుతున్న ఒఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న జునాగఢ్‌కు చెందిన వృద్ధుడు బికారి చరణ్ పాఢి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బస్సు కుందిలి చేరేసరికి వృద్ధుడు గుండెపోటుతో అల్లాడిపోయాడు. దీంతో ఆయన భార్య ఆందోళన చెందగా అదే బస్సులో ప్రయాణిస్తున్న పాత్రికేయులు రాజారెడ్డి వారణాసి, ఎల్.సంతోష్‌కుమార్ స్పందించి బస్సును సరాసరి సిమిలిగుడ ఆస్పత్రికి తరలించాలని డ్రైవర్‌ను కోరారు. దీంతో డ్రైవర్ బస్సును ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ రాకేష్ ప్రధాన్‌కు పరిస్థితిని వివరించిన పాత్రికేయులు అతడిని బస్సు వద్దకు తీసుకువెళ్లారు. ప్రాథమిక వైద్యం అందించిన డాక్టర్ రోగికి గుండెపోటు వచ్చిందని నిర్ధారించాడు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో రోగి ప్రాణాలు నిలబడ్డాయని తెలిపారు. అనంతరం అతడిని కొరాపుట్‌లోని ఎస్ఎల్ ఎన్ మెడికల్ కాలేజీకి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

ఒడిస్సీ నృత్య కళా కేంద్రం ప్రారంభం



ఒడిస్సీ నృత్య కళాకేంద్రం ప్రారంభోత్సవంలో కళాకారులు, చిన్నారులు



ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో చిన్నారి

రాయగడ: స్థానిక రామకృష్ణ నగర్‌లో ఆదివారం సాయంత్రం నృత్యకళా కేంద్రం ప్రారంభమైంది. ప్రముఖ నృత్యకళాకారిణి ఇమాని సతపతి దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. అంతరిస్తున్న సంప్రదాయ కళలకు ఊపిరి పోసేందుకు ఈ కళాకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలియజేశారు. చిన్నారుల్లో దాగి ఉన్న కళలకు పదును పెట్టి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రముఖ కళాకారుడు, గాయకుడు కాశీ చరణ్ రొథొ మాట్లాడుతూ రాయగడలో ఎంతో మంది కళాకారులు ఉన్నప్పటికీ వారికి సరైన సాధనా కేంద్రం లేకపోవడంతో ఆయా రంగాల్లో రాణించలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. అలాంటి వారికి ఈ కేంద్రం ఆసరాగా నిలుస్తుందని అన్నారు.

అడ్డదారిలో అధికారం

● బీజేపీపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ధ్వజం



మాట్లాడుతున్న అప్పలస్వామి, పక్కనే పవిత్ర, మంగరాజ్, తదితరులు

రాయగడ: బీజేపీ అడ్డదారిలో అధికారాన్ని దక్కించుకుందని, ఆ పార్టీని ప్రజలు ఎన్నడూ క్షమించరని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర సామంత అన్నారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బీజేపీ ఓట్లను చోరీ చేసి అడ్డగోలుగా గద్దెనెక్కారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల కమిషన్ సమాధానం ఇవ్వాలన్నారు. రాయగడ కాంగ్రెస్ భవనంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ అవినీతి, అసమర్థత పాలనపై దుమ్మెత్తిపోశారు. ఎన్నికల కమిషన్‌ను కీలుబొమ్మగా మార్చుకుని, ఓట్లు చోరీ చేసి ప్రజల నమ్మకాన్ని వమ్ముచేశారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సంపూర్ణ మద్దతు బీజేపీకి లేకపోతే గత ఎన్నికల్లో మరింత మెజార్టీతో గెలిచేవారమన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిజం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పకపోతే ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీపీ ప్రధాన కార్యదర్శి శంకర్షన్ మంగరాజ్, నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌కు 52 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ బూదర పంచాయతీలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. ఆదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫాల్గునీ మఝి, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, జిల్లా పరిషత్ ముఖ్య అభివృద్ధి అధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా హాజరయ్యారు. కాశీనగర్, బూదర, గోరిబోంద, ఖండవ పంచాయతీల నుంచి మొత్తం 52 వినతులు అందాయి. వీటిలో వ్యక్తిగతం 28, గ్రామ సమస్యలు 23 ఉన్నాయి. ముఖ్యంగా పీఎం ఆవాస్ యోజనా, సామాజిక పింఛన్లు, ఉపాధి పనులపై అభియోగాలు అందాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఏడీఎం మఝి ఆదేశించారు. కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, బీడీవో దంభధర మల్లిక్, ఇతర అధికారులు హాజరయ్యారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బిజయ జెనా

జయపురం: పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి బిజయ జెనా అన్నారు. సోమవారం స్థానిక యాదవ భవనంలో సంఘ అధ్యక్షుడు నళినీ కాంతరథ్ అధ్యక్షతన సమావేవం జరిగింది. బిజయ జెన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెనా మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్సనర్లు నెలకు రూ.9 వేల పెన్షన్ కోరటం న్యాయసమ్మతమన్నారు. పీఎఫ్ నిధి నుంచి వచ్చే వడ్డీని వారికి పెన్షన్‌గా ఇస్తున్నారన్నారు. నెలకు రూ.9 వేల పెన్షన్‌ను మంజూరు చేయాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై వామపక్ష పార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేస్తూనే ఉన్నారని వెల్లడించారు. ఇతర పార్టీల ఎంపీలు, కొంత మంది బీజేపీ ఎంపీలు కూడా ఈపీఎఫ్ పెన్సనర్ల డిమాండ్‌ను సమర్థిస్తున్నారని వెల్లడించారు. అయినా వారి డిమాండ్‌పై కేంద్రం ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. డిమాండ్లను ప్రభుత్వం నేరవేర్చేంత వరకు పోరాటం సాగించాలన్నారు. భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ నేతలు జి.ప్రకాశరావు, ఎ.ఎస్.రాజు, ఎన్.ఎస్.ఆర్.మూర్తి, బసంత బెహర, ఎస్.కె.ప్రధాన్, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

దయా నది ఒడ్డున యువకుడి మృతదేహం లభ్యం



జ్యోతి రంజన్ బెహరా

భువనేశ్వర్: రాజధాని భువనేశ్వర్ శివార్లలోని దయా నది ఒడ్డున సోమవారం యువకుడి మృతదేహం గుర్తించారు. దయా పశ్చిమ కాలువ నుంచి యువకుడి మృత దేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని జ్యోతి రంజన్ బెహరా (34)గా గుర్తించారు. యువకుడిని హత్య చేసి అక్కడ మృత దేహాన్ని పడేసి ఉంటారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుడి బైక్ సంఘటన స్థలంలోనే పడి ఉంది. ఆ యువకుడు ఆదివారం నుంచి కనిపించడం లేదు. అతడిని హత్య చేశారని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమీపంలోని మార్కెట్‌ను సందర్శించడానికి వెళ్లిన కొడుకు ఇంటికి తిరిగి రాలేదు. రాత్రి అంతా కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయిందని కుటుంబీకులు వాపోతున్నారు. సోమవారం ఉదయం దయా పశ్చిమ కాలువ ఒడ్డున యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు దృష్టికి వచ్చింది. ఎయిర్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు, సైంటిఫిక్ బృందం సంఘటనా స్థలం సందర్శించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరీక్షల కోసం తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పాము కలకలం



పట్టుబడిన పాము

భువనేశ్వర్: ముఖ్యమంత్రి ఫిర్యాదుల విచారణ శిబిరంలో సోమవారం పాము కలకలం రేపింది. ముఖ్యమంత్రి విచారణ కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు నిరీక్షిస్తున్న ప్రాంగణం పైకప్పు నుంచి పాము కిందకు జారింది. సురక్షితంగా దానిని తరలించేందుకు స్నేక్ హెల్ప్ లైన్ కార్యదర్శికి ఫోన్ చేయడంతో సువేందు మల్లిక్ సకాలంలో ఘటనా స్థలం చేరి పామును అదుపులోకి తీసుకున్నాడు. పసుపుపచ్చని రంగులో ఒక అడుగు పొడవు ఉన్న ఈ పాముని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

103 వినతుల స్వీకరణ



సమస్యను తెలియజేస్తున్న దివ్యాంగ వృద్ధుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ గ్రీవెన్స్ నిర్వహించారు. సమితి ప్రజలు తమ సమస్యలను వినతుల ద్వారా తెలియజేశారు. మొత్తం 103 వినతలును కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత ఇదే తొలి పర్యటన. ఈ సమితిలో జరిగిన అభివృద్ధి పనులు గూర్చి, జరగాల్సిన అభివృద్ధి పనుల గూర్చి ఉద్యోగులతో చర్చించారు. వినతలును పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ సోభరో, తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని భయపెట్టి దోచేశారు

● అధిక వడ్డీలతో రూ.1.52 కోట్లు కాజేశారు
● ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేసిన వ్యక్తి

శ్రీకాకుళం క్రైమ్: తనను కొంతమంది వ్యక్తులు భయపెట్టి రూ.1.52 కోట్లు దోచేశారని, కులం పేరుతో దూషించి కొట్టడమే కాకుండా కుటుంబంతో సహా చంపుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని నగరంలోని న్యూకాలనీకి చెందిన కొత్తపల్లి సాయివివేక్ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సాయివివేక్‌కు పీఎన్‌కాలనీకి చెందిన పైలా చంద్రశేఖర్ (కుంగ్‌ఫూ శేఖర్) 2014లో పరిచయమయ్యారు. 2021 నుంచి 2023 అక్టోబర్ వరకు రాగోలు జెమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిలో మెడికల్ ఆఫీసర్‌గా సాయివివేక్ పనిచేసే సమయంలో చంద్రశేఖర్ తనకు ఏ అవసరమైనా సాయపడతానని చెప్పడంతో సరేనన్నాడు. దీనిలో భాగంగా 2023 నవంబర్‌లో సొంత అవసరాల నిమిత్తం రూ.35 లక్షలు అప్పు సాయివివేక్ అడగడంతో, చంద్రశేఖర్ అతని మిత్రులు వాండ్రంగి కృష్ణచైతన్య, నగిరెడ్డి సాయికుమార్, జనపరెడ్డి సన్యాసిరావుల అకౌంట్ల నుంచి నగదు పంపించాడు. దీనికి సంబంధించి బాండ్ పేపర్లు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు చంద్రశేఖర్ వద్దే ఉంచుకున్నాడు. బాండ్ పేపరులో రూ.2 లకు వడ్డీ పేరిట చంద్రశేఖర్ రాయించుకున్నాడని, ఆ తర్వాత ఎప్పుడు డబ్బులు వేయాలన్నా.. తన భార్య హిమబిందు అకౌంట్‌కే వేయాలని చంద్రశేఖర్ చెప్పడంతో 2023 నవంబర్ నుంచి 2024 జూలై వరకు అసలు, వడ్డీతో కలిపి క్లియర్ చేయడం జరిగిందని సాయివివేక్ తెలియజేశారు. అయినప్పటికీ రూ.10ల అధిక వడ్డీతో డబ్బులు ఇవ్వాలని బెదిరించడం, ఒకానొక సందర్భంలో తనవద్దనున్న ప్రామిసరీ నోట్లు, బాండ్లు ఇస్తానని ఇంటికి పిలిపించి కొరడాతో కొట్టడం, చంపుతామని బెదిరించడం చేశాడన్నారు. దీంతో చేసేదేమీలేక చంద్రశేఖర్ భార్యకు రూ.1.01 కోట్లు, నగిరెడ్డి సాయికి రూ. 17.40 లక్షలు, కృష్ణచైతన్యకు రూ.5,87,700లు, జనపరెడ్డి సన్యాసిరావు (తాతాజీ)కి రూ.31,99,850లు కార్‌లోన్, హోమ్‌లోన్లతో కలిపి ఆన్‌లైన్‌లో వేశానని తెలియజేశారు.

మోసగాడిగా చిత్రీకరించారు

వేధింపులు భరించలేక గత నెల జూలై 8వ తేదీన డబ్బులిచ్చేది లేదని చెప్పేశానని పేర్కొన్నారు. దీంతో చంద్రశేఖర్ తన వద్దనున్న చెక్కులతో కొందరి స్నేహితులు తనకు అప్పులు ఇచ్చినట్లుగా సృష్టించడంతో పాటు వివిధ పత్రికల్లో తనను మోసగాడిగా చిత్రీకరించాడన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఈనెల 2వ తేదీన కుషాయిగూడలో ఆత్మహత్యాయత్నం చేశానన్నాడు. తానుండేది నేరేడుమెట్ట పరిధి కావడంతో రాచగుంట పీఎస్‌లో కేసు నమోదైందని సాయివివేక్ పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీ మహేశ్వరరెడ్డికి కలిసి న్యాయం చేయాలని కోరడంతో పాటు చంద్రశేఖర్ తనను మానసికంగా, శారీరకంగా వేధించిన ఆధారాలు, బ్యాంకు లావాదేవీల ఆధారాలన్నీ పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి సమర్పించాడు. వెంటనే ఎస్పీ మహేశ్వర రెడ్డి రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావుకు సమస్యను మూడు రోజుల్లో పరిష్కరించమని ఆదేశాలిచ్చారు. ఇదే విషయం సీఐ ఈశ్వరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా సివిల్ మ్యాటర్ అని, విచారణ చేస్తున్నామన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

టెక్కలి రూరల్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను సోమవారం టెక్కలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గుణుపూర్‌కు చెందిన విశాల్ కేశరి సమాల్, మూనలిమ్మ అనే ఇద్దరు వ్యక్తులు కొరాపుట్‌కు చెందిన ముఖేష్ బాగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గుణుపూర్ నుంచి ట్రైన్‌లో టెక్కలి వచ్చి అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ముందస్తు సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో కలిసి రైల్వేగేటు సమీపంలోని బాపినాయుడు కాలనీ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వారి వద్ద నుంచి 9.25 కేజీల గంజాయి పట్టుబడింది. వీరు గోవాకు చెందిన వినాయక్ బాలచంద్ర చౌహాన్ అనే వ్యక్తికి ఈ గంజాయి అప్పగించేందుకు వెళ్తుండగా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మృతదేహం కలకలం

పలాస: పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పెంటభద్ర గ్రామానికి వెళ్లే దారిలో కుంకుమ సాగరం వద్ద సోమవారం గుర్తు తెలియని ఒక మృతదేహాన్ని స్థానికులు చూశారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.

కాసీపూర్‌లో 140 వినతుల స్వీకరణ



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ అశుతోష్, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ తదితరులు

రాయగడ: జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి జిల్లాలోని కాసీపూర్‌లో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీ ప్రాంతమైన ఈ సమితిలో 453కు పైబడి రెవెన్యూ గ్రామాలు ఉండటంతోపాటు కొండ, కోనల్లో అధిక శాతం గ్రామాలు ఉన్నాయి. కనీసం మౌలిక సౌకర్యాలకు ఆమడదూరంలో ఉన్న గ్రామాల కోకొల్లలు. ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి 140 సమస్యలు వెళ్లాయి. ఇందులో 117 వ్యక్తిగత సమస్యలు కాగా 21 గ్రామాలకు చెందిన ప్రజలు తమ గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వాటి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఇద్దరికి రెడ్ క్రాస్ నిధుల నుంచి 35 వేల రూపాయలను కలెక్టర్ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరా, సమితి అధ్యక్షులు కొంతొ మాఝి పాల్గొన్నారు.

ముఠ్వన్నెల కోణార్కు ఆలయం



యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయం ఇలా ముఠ్వన్నెల కాంతులీని సరికొత్త శోభతో పర్యాటకులు, సందర్శకుల దృష్టిని ఆకట్టుకుంటుంది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న వేళ ఆలయాన్ని మూడురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. - భువనేశ్వర్

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని బీపీ(బద్రీప్రసాద్)కాలనీకి చెందిన వరదా సత్యవతి(65) పాము కాటుతో మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్యవతి ఆదివారం రాత్రి ఇంటిలో మంచంపై పడుకున్న సమయంలో పాటు కాటు వేసింది. విషయం తెలుసుకున్న వెంటనే బాధితురాలిని చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఆమె ప్రాణాలు విడిచింది. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నామని ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు.

గంజాయి కేసులో నిందితులకు రెండేళ్లు జైలు


గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: విజయనగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2024లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు రెండేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే జడ్జి ఎం.మీనాదేవి తీర్పు వెల్ల డించారని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం తెలిపారు. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే..విజయనగరం టూటౌన్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గతేడాది ఆగస్టు 25న స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో కోమటి చెరువు వద్ద ఇద్దరు వ్యక్తులు ఉమ్మంది ఎల్లయ్య (26) యూసఫ్ (25) పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకుని వారి నుంచి 3.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్ సీఐ టి.శ్రీనివాస రావు రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌లో నిందితులపై నేరారోపణలు రుజువుకావడంతో ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు.

గేదెను ఢీకొట్టి యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన బర్ల సాయి

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొట్లాం హైవేపై ఆదివారం రాత్రి కెరటాం గ్రామానికి చెందిన బర్ల సాయి(21) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. సాయి తన పల్సర్ బైక్‌పై గొట్లాం హైవే మీదుగా వెళ్తుండగా గుంకలాం చెరువు వద్ద ఆకస్మాత్తుగా గేదె అడ్డు రావడంతో బైక్‌ను అదుపు చేయలేక గేదెను ఢీ కొట్టాడు. బైక్‌పై ఉన్న బర్ల సాయి కిందపడడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రూరల్ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

ప్రైవేట్ కళాశాల బస్సు, ఆర్టీసీ బస్సు ఢీ

- 8 మంది విద్యార్థినులకు తీవ్ర గాయాలు
- విషమంగా ఒకరి పరిస్థితి


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో చింతలపాలెం జంక్షన్ సమీపంలో ఎదురు ఎదురుగా వస్తున్న ప్రైవేట్ కళాశాల బస్సు, ఆర్‌టీసీ బస్సు ఢీకొనడంతో 8 మంది విద్యార్థినులు గాయాల పాలయ్యారు. వారిలో ఒక విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం ఎండాడ ఐటీ సెక్టార్‌కు వెళ్తున్న సింహాచలం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు లక్కవరపుకోట మండలం కొట్యాడ గ్రామం సమీపంలో గల బెహరా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన బస్సు పెందుర్తి నుంచి విద్యార్థులు, బోధన సిబ్బందిని ఎక్కించుకుని తీసుకొస్తుండగా ఎదురెదు రుగా ఢీకొన్నాయి. దీంతో జరిగిన ఈ ప్రమాదంలో బెహరా కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు గాయాల పాలయ్యారు. వారిని వెంటనే గోపాలపట్నం సమీపంలో గల బెహరా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. కాగా గాయ పడిని వారిలో విద్యార్థిని కృతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమదం వార్త తెలుసుకున్న కొత్తవలస పోలీస్‌లు రెండు బస్సులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్రీ బస్సు మీద కస్సుబుస్సు

- రోడ్డున పడిన ఆటోడ్రైవర్లు
- ఆందోళనలో సుమారు 28వేల కుటుంబాలు
- తమ పరిస్థితి ఏమిటని ఆవేదన
- వాహనమిత్ర అమలు చేయాలని భారీ ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద ఆందోళన


సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఏపీలో మహిళలకు ఫ్రీ బస్ హామీ కాకరేపుతోంది. ఆ హామీ అమలు చేసి తమ పొట్ట కొట్టొదంటూ ఆటోడ్రైవర్లు ర్యాలీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించొద్దంటూ విజయనగరంలో ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. చలో కలెక్టరేట్ నినాదంతో ర్యాలీ చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలతో తమకు ఉపాధి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రీ బస్సు నడిపే ముందు తమ వ్యవహారం చూడాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. ఎక్కడికక్కడ మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తే తమకు ఉపాధి అవకాశాలు దెబ్బ తింటాయని విజయనగరం ఆటో కార్మిక సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆటో కార్మికులు సమస్యలుపై జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కి వినతిపత్రం

ఆటో చక్రం కదిలితేనే బతుకు బండి సాగేది

దశాబ్దాలుగా వారి జీవనాధారం ఆటోలే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 28వేల మంది ఆటో, క్యాబ్ కార్మికులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వారికి వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఏటా అమలయ్యేది. ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయడం ద్వారా లబ్ధి చేకూరేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాహన మిత్ర కింద రూ.15వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచి విస్తృత ప్రచారం కల్పించారు. దాన్ని నమ్మి వారంతా కూటమి ప్రభుత్వానికి ఓటేశారు. ఇప్పుడు మోసపోయామని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. జగనన్న ప్రభుత్వంలో ఏటా వాహనమిత్ర పథకం తమకు అందేదని ఇప్పుడు దాన్ని కూటమి పాలకులు పక్కన పెట్టారని వాపోతున్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆందోళన..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాహన మిత్ర పథకం కింద ఇస్తామన్న రూ. 15వేలు నేటికీ ఇవ్వలేదు. ఆ ఊసే ఎత్తడం లేదు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ,క్యాబ్ డ్రైవర్లు సంక్షేమం కోసం రూ. 400 కోట్లు బడ్జెట్ కేటాయించి నాడు అర్హులందరికీ రూ. 10వేలు చొప్పున అందించారు. కూటమి ప్రభుత్వం ఆ మాదిరిగానే ఇస్తుందని ఆశించిన డ్రైవర్లకు నిరాశే మిగిలింది. ఇదే సమయంలో స్త్రీశక్తి కింద మహిళలకు ఉచిత బస్సు పథకం తీసుకువస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన క్రమంలో తమ బతుకు బండి సంగతేంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

హామీల అమలుకు ర్యాలీ..

కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాహనమిత్ర హామీతో పాటు మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డ్రైవర్లు, మోటారు కార్మికులు డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు అమలు చేసేలోపు వాహనమిత్ర అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సోమవారం డ్రైవర్లు, కార్మికులు విజయనగరంలో ర్యాలీ నిర్వహించారు.

వాహనమిత్ర అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం వాహన మిత్ర కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. జీవో నం 21 రద్దు చేసి అపరాధ రుసుం భారం తగ్గిస్తామని చెప్పింది. వాహనాలపై పెంచిన గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తామని, వాహన కొనుగోలుకు సంబంధించి వడ్డీపై సబ్సిడీ అందిస్తామని నేతలు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదైనా నేటికీ అవేమీ అమలు కావడం లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ చెబుతున్నారు. ఈ క్రమంలో అంత కంటే ముందు వాహనమిత్ర అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేసే వరకు పోరాడతాం.

– ఆటో కార్మికుడు, జి.కూర్మారావు, విజయనగరం

మా గోడు వినండి ..



ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేయడానికి నిర్ణయించిన మహిళలకు ఫ్రీ బస్సు పథకం వల్ల స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారు. కరోనా అనంతరం ఆర్థికంగా దెబ్బతిన్న ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలు నేటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నాయి. ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా సొంత పెట్టుబడితో ఒక పక్క ఫైనాన్స్ చెల్లించుకుంటూ మరోవైపు ప్రభుత్వనికి చెల్లించాల్సిన రోడ్, గ్రీన్ టాక్స్, రెన్యువల్, పొల్యూషన్ వంటి పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నారు. పట్టణంలో కార్పొరేట్ సంస్థలైన రాపిడో, ఉబర్, ఓలా వంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం వల్ల ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధి దెబ్బతింది. వ్యక్తిగత వాహనాలపై పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వహించకూడదని కర్ణాటక హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బహుళ జాతి సంస్థలకు అనుమతులను ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకుంటామని చెప్పి హామీ గాలికొదిలేసింది.

– కె.సురేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉచిత బస్సుపేరుతో కార్మికుల పొట్ట కొట్టొద్దు

- కలెక్టరేట్ ఎదుల ఆటో డ్రైవర్ల ఆందోళన


సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పలు మండలాలకు చెందిన వందలాదిమంది ఆటో కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా పట్టణ ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తే ఆటో కార్మికులలో 60శాతం మందికి ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏదైనా పథకం ప్రవేశపెట్టినప్పుడు దాని ప్రభావం వల్ల ఎంతమంది నష్టపోతారో ఆలోచన చేసి పరిశీలించి శాస్త్రీయంగా నష్టపరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక విధాలుగా ఉపాధిలేక అవస్థలు పడుతున్న ఆటో కార్మికుల పరిస్థితి ఈ ఉచిత బస్సుతో మరింత దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పింఛన్లు వంటివి చెల్లించి వాహన మిత్ర తరహాలో పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఆటో, ట్యాక్సీ డ్రైవర్‌కు ఏడాదికి రూ. 25వేలు పరిహారం చెల్లించాలని, అలాగే ఇప్పటికే తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ ప్రభుత్వం రూపొందించకపోతే ఆటో, ట్యాక్సీ కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు, బీవీ రమణ, కోశాధికారి జి.వెంకటరమణ, కె.గంగునాయుడు, సాంబమూర్తి, ఉమామహేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు శంభాన చిన్న, డి. రాము, క్రాంతి, నారాయణ, సత్యనారాయణ, శ్రీను, శంకరరావు , పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మేనమామను కడతేర్చిన మేనల్లుడు


పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు


మృతుడు అప్పలకృష్ణ

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన వ్యక్తిని సొంత మేనల్లుడు చంపి ఆ తరువాత సహజంగానే చనిపోయినట్లు అందరినీ నమ్మించి దహనసంస్కారాలు నిర్వహించాడు. ఈ విషయంపై 100కు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నీడిగేటి అప్పల కృష్ణ (42), మేనల్లుడు నారపాటి సాయి శనివారం మద్యం తాగడానికి గ్రామం బయటకు వెళ్లారు. అక్కడే మద్యం మత్తులో మేనమామ కృష్ణను సాయి హత్య చేసి ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చేశాడు. మేనమామ ఏడని, ఇద్దరు కలిసి వెళ్లి ఒక్కడివే వచ్చావని మృతుడి భార్య అడగ్గా మద్యం ఎక్కువై పడుకున్నాడని సమాధానం చెప్పాడు. కొద్దిసేపటి తరువాత మృతుడు కృష్ణను సాయి బైక్‌పై తీసుకు వచ్చి చలనం లేదని, చనిపోయి ఉంటాడని అందరిరినీ నమ్మించే ప్రయత్నం చేసి మృతదేహానికి దహన సంస్కారాలు చేశారు. శవాన్ని వారి ఆచారం ప్రకారం పూడ్చిపెట్టారు. కార్యక్రమం అనంతరం సాయి విశాఖపట్నంలోని గోపాలపట్నం వెళ్లి పోయాడు. మృతుడు కృష్ణ సొంత చెల్లెలి కొడుకు సాయి కాగా కొంతకాలంగా వారు గోపాలపట్నంలో ఉంటున్నారు. తరచూ సాయి మేనమామ ఇంటికి వస్తూ పోతుంటాడు. ఈ క్రమంలోనే శనివారం వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణ చనిపోవడం పట్ల పోలీసులకు 100కాల్ రావడంతో సోమవారం రంగంలోకి దిగారు. శవాన్ని పాతిపెట్టిన ప్రదేశానికి తహసీల్దార్ డోలా రాజేశ్వరావుతో పాటు ఎస్సై యు.మహేష్ వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణమా?

మృతుడి భార్య రాజుతో మేనల్లుడు సాయికి కొన్ని సంవత్సరాలనుంచి వివాహేతర సంబంధం ఉందని ఈ విషయంపై మేనమామతో సాయికి గొడవ జరిగి హత్యకు దారి తీసిఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉండగా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. ఈ సంఘటన తర్వాత నిందితుడు పరారీలో ఉన్నాడు.

కొత్తవలసలో మరో చోరీ

- 15 తులాల బంగారం, 50 తులాల వెండి,
- రూ.లక్షా 50వేల నగదు దోచుకున్న దొంగలు
- పోలీసులకు తలనొప్పిగా మారిన వరున దొంగతనాలు


ఇంట్లో బీరువాను దొంగలు తెరిచి సామాన్లు చిందర వదరగా పడేసి ఉన్న దృశ్యం

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టులో సుమారు 5 కేజీల బంగారం, పెద్ద మొత్తంలో నగదును దొంగలు దోచుకుపోయిన విషయం మరవక ముందే మరో ఇంటిలో పడి పెద్ద ఎత్తున బంగారం, వెండి, నగదును దోచుకుపోయారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనతో వరుస దొంగతనాలు కొత్తవలస పోలీసులకు తలనొప్పిగా మారింది. ఘటన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీప బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న మోపాడ కృష్ణంనాయుడి ఇంటిలో శనివారం రాత్రి దొంగలు పడి 15 తులాల బంగారం, 50 తులాల వివిధ రకాల వెండిసామగ్రి, ఆయన కుమారుడి కళాశాల ఫీజు కట్టేందుకు దాచుకున్న రూ.లక్షా 50వేల నగదు దోచుకుపోయారు. కృష్ణంనాయుడు శనివారం రాఖీ పండగ సందర్భంగా ఎస్.కోటలో గల తన స్వగ్రామానికి కుటుంబంతో సహా వెళ్లారు.అదే రోజు సమీప బంధువైన ఓ వృద్ధురాలు మృతి చెందింది. దీంతో అంత్యక్రియల్లో పాల్గొని శనివారం రాత్రి ఎస్.కోటలోనే ఉండిపోయారు. మరుసటి రోజు ఆదివారం సాయంత్రం కొత్తవలసలో గల ఇంటికి కుటుంబంతో సహా వచ్చేసరికి ఇంటి ఇనుప కటకటాలకు సబంధించిన గడియలను కోసి ఇంటిలోకి దొంగలు చొరబడి ఇంట్లోని సామాన్లు, బీరువాలో బట్టలను చిందర వదంగా పడేశారు. అన్నీ పరిశీలించగా బంగారం, వెండి, నగదు పోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం విజయనగరం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి ఘటనా స్థలంలో పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు కృష్ణంనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్జీదారుల ఆకలి తీరుతోంది


కలెక్టరేట్ ఆవరణలో ఉచిత భోజనాన్ని తింటున్న ఓ దివ్యాంగ అర్జీదారు

పార్వతీపురం రూరల్: కలెక్టర్ కార్యాలయానికి ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చి తమ సమస్యల పరిష్కారానికి సొంత గ్రామాల్లో ఉదయం బయలు దేరి 10గంటల సమయానికి కలెక్టరేట్‌కు అర్జీదారులు చేరుకుంటారు. అయితే చార్జీలు భరించి వ్యయప్రయాసాలతో సామాన్యులు, దివ్యాంగులు తమ సమస్య పరిష్కారం కావాలనే ఆశతో వచ్చిన వారికి అర్జీలు అందజేసిన అనంతరం ఉచితంగా కలెక్టరేట్ ఆవరణలో భోజనం చేసేందుకు ఇటీవల కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆలోచన మేరకు భోజన సదుయాపం కల్పించారు. ఎంతోమంది అర్జీదారులు ఈ ఉచిత భోజన కార్యక్రమాన్ని వినియోగించుకుంటున్నారు. ఇంతమంచి ఆలోచన చేసిన కలెక్టర్‌కు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 44 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం అర్బన్: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లాలోని 44 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్ –2025 పోటీల్లో పాల్గొన్న 100 మంది నుంచి ఈ ఎంపిక జరిగిందన్నారు. ఈ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించిన 44 మంది త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారన్నారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జుట్టాడ ప్రీతి, ఎ.నారాయణ, రమేష్, హర్ష, భాస్కర్, కరుణ వ్యవహరించారు.

అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ


అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో సాధించిన పతకాలతో పాచిపెంట మండల కేంద్రానికి చెందిన యువత

పాచిపెంట: ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు చీరాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ 2025 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాచిపెంట మండల కేంద్రానికి చెందిన యువత ప్రతిభ కనబరిచారు. 10000, 5000 మీటర్ల పరుగు పందెంలో బొడ్డు సాయి మొదటి స్థానం సాధించగా, వాడాడ సతీష్ ద్వితీయ స్థానం సాధించాడు. 3000, 1500 మీటర్ల పరుగు పందెంలో ముల్లు హరీష్ మొదటి స్థానం సాధించాడు, అలాగే 5000 మీటర్ల రేస్‌వాక్ లో బుగత హరీష్ రెండవ స్థానం సాధించగా అండర్ 18 బాలికల విభాగంలో..ఉత్తరావల్లి మహాలక్ష్మి 1000 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం సాధించింది. మొత్తంగా..6బంగారు, 2రజత, 1కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు కోచ్ నేతేటి శేఖర్‌తో పాటు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర పోటీలకు గుణుపూరుపేట విద్యార్థినులు


రాష్ట్ర బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం అరుణ,పీఈటీ గౌరీశంకర్‌లు

డెంకాడ: రాష్ట్ర సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ ప్రకాశం జిల్లాలోని చెవ్వూరులో జరగనున్న పోటీలకు గుణుపూరుపేట ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినులు ఆబోతుల తేజస్విని, గేదెల మానస ఎంపికయ్యారు. అలాగే వచ్చే నెల అనంతపురంలో జరగబోయే జూనియర్ బాల్ బాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు పదవ తరగతి విద్యార్థినులు సీహెచ్ రోహిణి, కెల్ల నవ్య, కెల్ల రేష్మ ఎంపికయ్యారు. వారిని పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ అరుణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సారిపల్లి గౌరీశంకర్ తదితరులు అభినందించారు.

50వేల బంగారు కుటుంబాల దత్తత

- భారీ వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఆగస్టు 15 నాటికి 50వేల బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. పీ4 కార్యక్రమం, హర్ ఘర్ తిరంగా, సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలు తదితర అంశాలపై ఆన్‌లైన్‌లో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొదట 67,066 బంగారు కుటుంబాలను గుర్తించగా, వడపోతల అనంతరం ఆ సంఖ్య 60,612 కు తగ్గిందని కలెక్టర్ చెప్పారు. ఇంకా ఎవరైనా అనర్హులు ఉంటే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 15 నాటికి జిల్లాలో 50వేల బంగారు కుటుంబాల దత్తతను పూర్తిచేయాల్సి ఉందని, మార్గదర్శులను గుర్తించే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, ఫొటోలను సంబంధిత వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సీపీఓ పి.బాలాజీ, జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గడువు దాటినా పరిష్కరించకపోతే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్‌ఎస్‌కు 149 వినతులు


అర్జీలను వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించని జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి 149 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతిరోజూ లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా పరిష్కరించడానికే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పుడు చూసినా పరిష్కారాల నమోదు సున్నా కనబడాలని తెలియజేశారు. ప్రతి రీ ఓపెన్ కేసును పూర్తిగా విచారణ జరిపి పరిష్కార మార్గం చూడాలని సూచించారు. గడువులోగానే వినతులకు సమాధానాలు పంపాలని అలా చేయని అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అర్జీల స్వీకరణలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, విజయనగరం డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీల గాంధీ పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 37 ఫిర్యాదులు


డీపీఓలో ఫిర్యాదుల నుంచి వినతులను తీసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని,వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 37 ఫిర్యాదులను స్వీకరించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.